క్లుప్తంగా

బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలి నియామకం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా యానంపల్లి గ్రామానికి చెందిన షేరు స్రవంతి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌కుమార్ ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, నాయకులు చౌకి లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, శివారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయండి



ఖలీల్‌వాడి: ఈ నెల 18న ప్రెస్‌క్లబ్‌లో జరిగే సదస్సును విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో జిల్లాలోని వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించ వలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ, ఐటీ తదితర సంస్థలను ప్రయోగించి ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందన్నారు.

ఘన నివాళి



సిరికొండ: గడ్కోల్ గ్రామంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వర్‌రావు 9వ స్మారక సభను శుక్రవారం నిర్వహించారు. కానూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి కార్ల్ మార్క్స్, మండలాధ్యక్షుడు భూమేష్, గంగాధర్, శివరాజ్, రాములు, కృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ



నిజామాబాద్‌నాగారం: ఉబంటు ట్రస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని మారుతీనగర్ స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ పాఠశాల వసతి గృహంలో చదువుకునే దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్టు కోశాధికారి దేవగాం రామాచారి మాట్లాడుతూ.. విశ్రాంత ఐఏఎస్ అధికారి తొగర్ల చిరంజీవుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, దివ్యాంగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడా రామ మందిరంలో రామాయణ ప్రవచనాలు



నిజామాబాద్ సిటీ: శ్రీ రామ నవమి సందర్భంగా నగరంలోని పెద్ద రామ మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రముఖ ప్రవచనకర్త, జోతిష్యులు శశికాంత్ జోషి వాల్మీకి రామాయణాన్ని, సీతారాముల కల్యాణోత్సవం ఘట్టాన్ని భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాయణాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితానికి అన్వయించుకోవాలని, ధర్మబద్ధంగా జీవించాలని అన్నారు. బడా రాంమందిర్ పీఠాధిపతి సీతారామచంద్రమూర్తి, స్థానికులు పాల్గొన్నారు.


వినాయక్‌నగర్ ఉపకేంద్రం పరిధిలో ఫీడర్ మరమ్మతులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక నగర్ ఉపకేంద్రంలోని ఆర్యనగర్2 ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ టౌన్–1 చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. 100 ఫీట్ రోడ్డు, తుల్జా భవాని టెంపుల్, ఎల్జీ స్విమ్మింగ్ పూల్, గూడెం, భవానినగర్, సాయి కృపానగర్, పంచముఖి హనుమాన్ టెంపుల్, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్, సాయి నిలయం, అరేబియన్ మండీ, రాఘవ స్కూల్, హీరో షోరూం, అశోక టవర్స్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎండుతున్న ఔషధ మొక్కలు

- పట్టణ ప్రకృతి వనంలో పనిచేసే వారు ఒక్కరే ఉండటంతో ఇబ్బందులు
- కొరవడిన అధికారి పర్యవేక్షణ





పార్కులో ఎండిపోయిన ఔషధ మొక్కలు

నిజామాబాద్ సిటీ: నగరంలోని న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీ పట్టణ ప్రకృతి వనంలో ఔషధ మొక్కలు ఎండిపోతున్నాయి. ఓ వైపు తీవ్రమైన ఎండలు, మరోవైపు పార్కుపై పర్యవేక్షణ లేకపోవటంతో ఎన్నో రకాల ఔషధ మొక్కలు ఎండలకు మాడిపోతున్నాయి. మూడేళ్ల క్రితం వనంలో అభివృద్ధి పనులు చేపట్టి మధ్యలోనే వదిలిపెట్టారు. దాంతో 4 నెలల క్రితం వనం దుస్థితిపై 'సాక్షి'లో కథనం ప్రచురించటంతో వనంలో మిగిలి పోయిన అభివృద్ధి పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. కానీ వనంలో మరికొన్ని పనులు పూర్తి కావల్సి ఉన్నాయి. ఇవి ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియదు కానీ, ప్రస్తుతం ఉన్న మొక్కలు ఎండిపోతున్నాయి. వేసవి కాలం కావటంతో వనంలో పనిచేసే వారు ఒక్కరే ఉండటంతో చెట్లు, మొక్కలు, గడ్డికి నీళ్లు పట్టేవారు సరిపోవటంలేదు. దాంతో పట్టణ ప్రకృతి వనంలో మంచి ఔషధ గుణాలు కలిగిన మొక్కలు ఎండిపోతున్నాయి.

పెరుగుతున్న సందర్శకులు..

న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం విశాలంగా ఉండటంతో సేద తీరేందుకు గుడిసె ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. వనం అందంగా కనిపించేలా గ్రీనరీ పరిచారు. కూర్చోడానికి బెంచీలు, ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. దాంతో పార్కుకు సందర్శకుల సంఖ్య నానాటికి పెరుగుతోంది.

మొక్కల్ని రక్షించండి



పట్టణ ప్రకృతి వనం అందంగా తీర్చిదిద్ది ఔషధ మొక్కలు నాటారు. నీళ్లు పట్టక పోవటంతో ఇవి ఎండిపోతున్నాయి. పార్కు పర్యవేక్షణ అధికారి పట్టించుకోవటం లేదు. వేసవిలో మండే ఎండల నుంచి వీటిని కాపాడితే ప్రయోజనకరంగా ఉంటుంది.

– లక్ష్మణ్, న్యూహౌసింగ్‌బోర్డు కాలనీ

రెండు పూటలా నీళ్లు పోయాలి



వేసవిలో మొక్కలు తొందరగా వాడిపోతుంటాయి. ఔషధ మొక్కలు ఎండిపోయి వికారంగా కనబడుతున్నాయి. వీ టికి రెండు పూటలా నీళ్లు పోయాలి. మున్సి పల్ వర్కర్ ఒక్కరే ఉండటంతో నిర్వహణ కష్టంగా మారింది. మరొక వర్కర్‌ను నియమిస్తే బాగుంటుంది.

– గంగారెడ్డి, వినాయక్‌నగర్

పచ్చదనాన్ని కాపాడాలి



పట్టణ ప్రకృతి వనంలో పచ్చదనాన్ని కాపాడాలి. ఈ వనం ఎంతో విశాలంగా, అందంగా తీర్చిదిద్దటంతో ఇక్కడకు నిత్యం అనేకమంది సందర్శకులు వస్తున్నారు. వనంలో మిగిలిపోయిన పనులను చేపట్టి పూర్తి చేయాలి. నాటిన మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి.

– శంకర్, న్యూహౌసింగ్‌బోర్డు కాలనీ

కేంద్ర పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్



డిచ్‌పల్లిలో కొనుగోలు కేంద్రంలోని వడ్లను పరిశీలిస్తున్న కులాచారి దినేష్

డిచ్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామాల్లో లక్షలాది పేద కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ కుమార్ పేర్కొన్నారు. లాబర్థి సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి, మిట్టాపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులను బీజేపీ నాయకులు ముఖాముఖి కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వారికి వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను గెలిపించి మోదీని మూడో సారి ప్రధానిగా చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తోందని, దీంతో పలువురు రైతులు దళారులకు తమ ధాన్యం విక్రయించాల్సి వస్తోందని విమర్శించారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ భూమన్న, మండల అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి దేశ ప్రజల మద్దతు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): పదేళ్లలో ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో ప్రజలందరూ ఆయనకే మద్దతు తెలుపుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కులాస్‌పూర్, సింగంపల్లి, బాడ్సి గ్రామాల్లో లాభర్తీ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు, ప్రజలతో ముచ్చటించారు. ఇంటింటికీ తిరిగి ప్రధాని పదేళ్లల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కరపత్రాలు పంచి వివరించారు. అనంతరం దినేష్ కులాచారి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో 370 స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ద్యాప రవికుమార్, అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో జెడ్పీటీసీ చేరిక



సిరికొండ: సిరికొండ జెడ్పీటీసీ మాన్‌సింగ్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జెడ్పీటీసీకి, పాకాలకు చెందిన బాలకిషన్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరు ఐకమత్యంగా కృషి చేయాలని కోరారు. దేశమంతా కాంగ్రెస్ గాలి వీస్తోందని, రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే మనందరి లక్ష్యమని అన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులను అరెస్ట్ చేయాలి



నిజామాబాద్ సిటీ: గత గురువారం రాత్రి అర్సపల్లి రైల్వేగేట్ వద్ద ఓ హనుమాన్ మాల భక్తుడిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఇందూరు గురుస్వామి దేశాయి గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక హనుమాన్ జంక్షన్(వినాయక్‌నగర్)లో ధర్నా నిర్వహించారు. హనుమాన్ మాల ధరించిన అంగీర్గ నరేష్‌పై అకారణంగా దాడి చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో హనుమాన్ స్వాముల శక్తి ఎట్లా ఉంటుందో చూపిస్తామని హెచ్చరించారు. ధర్నాలో హనుమాన్ మాలధారణ స్వాములు సోమ శ్రీశైలం, సతీష్, సృజన్, భాస్కర్, ఠాకూర్, శంకర్, గోపి పాల్గొన్నారు.

ఐవీఎల్ పద్ధతిలో రోగికి అరుదైన చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ గోపికృష్ణ

నిజామాబాద్‌నాగారం: ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా ఐవీఎల్ పద్ధతి ద్వారా ఐవీయూఎస్ సహకారంతో నిజామాబాద్‌కు చెందిన రోగికి అరుదైన చికిత్స అందించామని యశోద ఆస్పత్రి డాక్టర్ గోపి కృష్ణ తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. నిజామాబాద్‌లో గుండె వైద్య నిపుణులుగా ఎన్నో సేవలు అందించామని, ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రి (హైటెక్ సిటీ) సేవలు అందిస్తున్నామని తెలిపారు. కమ్మర్‌పల్లి మండలం దమ్మన్నపేట్ గ్రామానికి చెందిన గుగులోత్ నందు(49) అనే రోగికి 10 సంవత్సరాల కిందట గుండెలో కవాటాలు మూసుకుపోగా హైదరాబాద్‌లో బైపాస్ ఆపరేషన్ చేసి మైట్రల్ వాల్‌ను అమర్చారని, ప్రస్తుతం మళ్లీ నందుకు ఛాతీ నొప్పి, ఆయాసం, గుండెదడ రావడంతో తిరిగి వైద్యులను సంప్రదించాడని తెలిపారు. గుండెలో ఇంతకుముందు అమర్చిన గ్రాఫ్టులు మూసుకుపోవడం, ప్రధాన గుండె రక్తనాళం కూడా మూసుకుపోయినట్లు గుర్తించారని, చాలా మంది డాక్టర్లను సంప్రదించినా మళ్లీ ఓపెన్ హార్ట్ ఆపరేషన్ చేయాలని చెప్పారని తెలిపారు. చివరగా నందు యశోద ఆస్పత్రిని సంప్రదించగా.. ఓపెన్ హార్ట్ ఆపరేషన్ అవసరం లేకుండా ఎల్ఎంసీఏ స్టంట్‌ను ఐవీఎల్, ఐవీయూఎస్ సహకారంతో అమర్చామన్నారు.

నిరుద్యోగులకు ఉచిత మధ్యాహ్న భోజనం

నిజామాబాద్‌అర్బన్: ఇందూర్ నగరం ఖలీల్‌వాడిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న పేద విద్యార్థులకు ధన్‌పాల్ లక్ష్మీబాయ్– విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా దాదాపు రెండు వందల మందికి ఉచిత మధ్యాహ్న భోజనం కల్పించారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూపెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఉద్యోగ అవకాశాలు సకాలంలో కల్పించాలని, నిరుద్యోగ భృతి రూ.4 వేలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుద్యోగుల తరుపున ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు తన ట్రస్ట్ ద్వారా సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. గ్రంథాలయంలో కూలర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విన్నవించగా.. వెంటనే ధన్‌పాల్ స్పందించి కూలర్లు ఏర్పాటు చేయాలని గ్రంథాలయ అధికారిని ఆదేశించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ మమత పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

గీతాభవన్‌లో సత్సంగం

నిజామాబాద్ సిటీ: ప్రబోధాత్మక సుమ గ్రంథం భగవద్గీత అని ప్రముఖ ధార్మికవేత్త బొడ్డు దయానంద్ అన్నారు. శుక్రవారం స్థానిక అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలిలో గీతా సత్సంగం జరిగింది. గీతలో జ్ఞాన, ధ్యాన, కర్మ, భక్తి, యోగ సాధనముల వివరణ ఉంటుందని ఆయన తెలిపారు. మానసికంగా, ఆరోగ్యపరంగా, ఆనందంగా ఉండడానికి పిల్లలు పెద్దలందరూ గీత శ్లోకాలను పఠించాలని ప్రవచన కర్త దయానంద్ వివరించారు. క్రోధి నామ సంవత్సరం అందరికి అనుకూలం కావడానికి ఈయేడు గోసేవ పూజలు, యజ్ఞ హోమాలు, ధార్మిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని ఆధ్యాత్మికవేత్త, వేద పండితులు బ్రహ్మశ్రీ జనగామ చంద్రశేఖర శర్మ పేర్కొన్నారు. అధ్యక్షుడు ఎంఎస్ నృసింహాచారి, కార్యదర్శి మేడిచర్ల ప్రభాకర్ రావు, కోశాధికారి ఆరెట్టి లక్ష్మీనారాయణపాల్గొన్నారు.

ముస్తాబవుతున్న సాయిబాబా ఆలయం

నిజామాబాద్ రూరల్: ఈ నెల 17న శ్రీరామనవమిని పురస్కరించుకుని మాధవనగర్ గ్రామంలోని సాయిబాబా ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ముఖ్యంగా ఆలయానికి రంగులు వేయడం, ఆలయ పరిసరాలను శుభ్రం చేయడంలో నిమగ్నమయ్యారు. శ్రీరామనవమి సందర్భంగా ఆలయానికి వస్తు, ధన రూపేనా కానుకలను అందించే వారు ఆలయంలోని ఈవో శ్రీరాం రవీందర్‌ను సంప్రదించాలన్నారు.



ఆలయానికి రంగులు వేస్తున్న పెయింటర్

నేటి చిత్రం..



ముబారక్‌నగర్ రోడ్డులోని డివైడర్

డివైడర్లు కట్టారు.. మొక్కలు మరిచారు

నగరంలోని ముబారక్‌నగర్ ప్రాంతంలో ప్రధాన రహదారిపై డివైడర్లు నిర్మించి మట్టి పోసినా మొక్కలు మాత్రం నాటలేదు. దీంతో డివైడర్లు వెలవెలబోయి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కలు నాటాలని నగర వాసులు కోరుతున్నారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

మోపాల్: మంచిప్ప గ్రామానికి తాగునీటి వసతిని ఏర్పాటు చేసేందుకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2.50 లక్షలతో పైప్‌లైప్ పనులను గ్రామస్తులు శుక్రవారం ప్రారంభించారు. గ్రామ శివారులోని దొడ్ల వాగు నుంచి పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. వేసవిలో తాగునీటి కొరత ఉన్నందున పనులు ప్రారంభించామన్నారు. నీటి సమస్య పరిష్కరించేందుకు ఎస్‌డీఎఫ్ నుంచి నిధులు మంజూరు చేసిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామస్తులు తూర్పు రాజేష్, దేవ శంకర్, వెంకట్రాం, మోహన్‌రెడ్డి, భాస్కర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డిచ్‌పల్లి: మండలంలో విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల కత్తిరింపు తదితర పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీ శ్రీనివాస్, ఏఈ సాయిలు శుక్రవారం తెలిపారు. డిచ్‌పల్లి, దూస్‌గాం గ్రామాల్లోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాల్లో నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం కలుగుతుందన్నారు.

నగరంలో..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సరస్వతినగర్, సివిల్ హాస్పిటల్ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ ఆపరేషన్ టౌన్–2 తోట రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. ఖలీల్‌వాడి, రాష్ట్రపతి రోడ్డు, గాంధీ చౌక్, నెహ్రూ పార్క్, హెడ్ పోస్ట్ ఆఫీస్, కుమార్ గల్లీ, హతాయ్‌గల్లీ, టౌన్–1 పోలీస్ స్టేషన్, ప్రగతి నగర్, పోచమ్మ గల్లి, ద్వారకా నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు బైశాఖీ పండుగ

నిజామాబాద్ సిటీ: నగరంలోని కంఠేశ్వర్ ఫతేగడ్ గురుద్వారాలో నేడు(శనివారం) సిక్కుల నూతన సంవత్సర పండుగ బైశాఖీ జరుగనుందని సిక్కు ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కృపాల్ సింగ్ తెలిపారు. ఈ పండుగను ఖాల్సా పంత్ అని కూడా అంటారు. గురు గోవింద్ సింగ్ మహారాజ్ 1699 మార్చి 30న ఖాల్సాపంత్‌ను కేశ్ ఘర్ సాహెబ్ అమృత్‌సర్‌లో పాంచ్ ప్యారేలను తయారు చేసి, దేశ సమైక్యత కోసం కులమతాలకు తావులేకుండా దేశాన్ని ధర్మాన్ని రక్షించటానికి వివిధ మతాలకు చెందిన అయిదుగురికి అమృతం తాగించి పాంచ్ ప్యారీగా నామకరణం చేశారు. అనంతరం ప్రతి సిక్కు సోదరులను సింగ్(లయన్)గా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో బైశాఖీ జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది.

ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్ వాడి: సిక్కుల పండుగ బైశాఖీ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. నేడు నగరంలోని పాములబస్తీ నుంచి సాయంత్రం 5 గంటలకు ఊరేగింపు ప్రారంభమై కంఠేశ్వర్ రైల్వే కమాన్, గురుద్వారా నుంచి గాజుల్‌పేట మీదుగా గురుద్వారా వరకు రాత్రి 10 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ ఊరేగింపు నగరంలోని ముఖ్య మార్గాలైన రైల్వే కమాన్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్ స్టాండ్, గాంధీ చౌక్, పెద్దబజార్ లక్ష్మీ మెడికల్ నుంచి గాజుల్ పేట్ గురుద్వారాకు చేరుకుంటుందన్నారు. నగర ప్రజలు ఇతర మార్గాల ద్వారా వెళ్లవలసిందిగా సీపీ కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	76,200	వెండి (కిలో)	87,000
22 క్యారెట్స్	69,000	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	30	50	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	30	50
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సిడ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	గీతాంజలి మళ్లీ వచ్చింది-10.40 టిల్లు స్క్వేర్(తెలుగు)- 1.30, 10.40 ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)- 4.20,7.30
స్క్రీన్-2	మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 10.30, 10.30 గీతాంజలి మళ్లీ వచ్చింది (తెలుగు) - 1.30,7.35 బడే మియా చోటే మియా (హిందీ)-4.30, 10.25
స్క్రీన్-3	దేర్ (తెలుగు)- 10.30, మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 1.45, 4.45, 10.45 మైదాన్ (హిందీ) - 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మైదాన్ (హిందీ)- 9.15, ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)- 1.05, 10.30 టిల్లు స్క్వేర్(తెలుగు)- 4.30, 7.30
స్క్రీన్-2	బడే మియా చోటే మియా- 10.00, 7.05, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్(3డీ)- 1.30, గీతాంజలి మళ్లీ వచ్చింది - 4.05 బడే మియా చోటే మియా (3డీ హిందీ)- 10.35
స్క్రీన్-3	లవ్‌గురు(తెలుగు)-10.15, 7.15, మంజుమ్మల్ బాయ్స్- 1.25, 4.20, గీతాంజలి మళ్లీ వచ్చింది -10.25
స్క్రీన్-4	మైదాన్ (హిందీ)- 12.00, మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 3.50, 6.35, లవ్ గురు (తెలుగు)-10.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	బడే మియా చోటే మియా (హిందీ) - 11.00 6.00, మైదాన్ (హిందీ)- 2.00 6.00
లలితామహల్	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు)
విజయ్	గీతాంజలి మళ్లీ వచ్చింది(తెలుగు)